క్లుప్తంగా

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేస్తున్న మండలి సభ్యులు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో వాసవి ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆవోగా ఫ్రెండ్లీ కిట్టీ పార్టీ నిర్వహించారు. శ్రీసూర్య నృత్యనికేతన్ విద్యార్థులు తూర్పుగోదావరి జిల్లా విశిష్టతను వివరిస్తూ ప్రదర్శించిన నృత్యరూపం అలరించింది. విద్యార్థినులకు మండలి సభ్యులు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. నికేతన్ నాట్యాచారిణి ఎం.మహాలక్ష్మి, మండలి నిర్వాకులు నాళం అండాళ్, ఎ.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్టు ఆలయం ప్రారంభం



ఆలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సంఘ అధ్యక్షుడు రెవరెండ్ అరుణ్‌కుమార్ తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎల్విన్‌పేటలో నూతనంగా నిర్మించిన తెలుగు బాపిస్టు సంఘ నూతన ఆలయ భవనాన్ని ఆదివారం సంఘ అధ్యక్షులు రెవరెండ్ పీడీ అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ కార్యదర్శి డాక్టర్ పీజేవీకే గాంధీ, పాస్టర్ బీవీ రాజు, గౌరవ అధ్యక్షులు ఏ.భక్త వత్సల్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



ప్రదర్శనలో వస్తువులను పరిశీలిస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ కాకినాడ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోందని నిర్వాహకులు ఆర్‌కే నాయుడు, శైలజారామ్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో క్లాతింగ్, జ్యూయలరీ, హోమ్ డెకార్స్‌కు సంబంధించి 40కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ మంగళవారం రాత్రి 9 గంటల వరకూ ఉంటుందన్నారు. కాకినాడ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శివార్లకు సాగునీరు అందించండి

- కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించాలి
- నీటి ఎద్దడిపై ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే కన్నబాబు సమీక్ష



క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులుతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: నియోజకవర్గ రైతులకు గోదావరి జలాలు సక్రమంగా అందించాలని, ముఖ్యంగా శివారు ఆయకట్టులో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రమణయ్యపేటలోని వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఇరిగేషన్ అధికారులతో కరప, కాకినాడ రూరల్ మండలాలలో నీటి ఎద్దడిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ వి.రామకృష్ణ, డీఈఈ రవికుమార్ తదితరులు పాల్గొనగా కరప మండలంలోని శివారు ప్రాంతాలు యండమూరు, విజయరాయుడుపాలెం, పెద్దాపురపాడు, వేములవాడ, కూరాడ తదితర గ్రామాలలో సాగు నీటి ఎద్దడిపై ఎమ్మెల్యే కన్నబాబు చర్చించారు. సోమవారం సాయంత్రానికి సాగు నీటి అందించాలని ఆదేశించారు. వెదజల్లు పద్ధతిలో రైతులు సాగు ప్రారంభించారని వారికి సకాలంలో నీటిని అందివ్వాలన్నారు. గోదావరి నుంచి తూర్పు డెల్టాకు 4900 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నామని ఎస్ఈ శ్రీనివాసరావు వివరించారు. కాల్వల్లో అడ్డుగా ఉన్న తూరలు, గుర్రపు డెక్క కారణంగా నీటి వేగం తగ్గడంతో శివారు భూములకు చేరడం లేదని, ఇప్పటికే గుర్రపు డెక్క తొలగింపు చేపట్టామని, క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని వివరించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా తక్షణం నీటిని పూర్తి స్థాయిలో అందించి, శివారు ఆయకట్టుతో పాటు నియోజవర్గంలో అన్ని గ్రామాలకు సక్రమంగా నీరు అందిస్తామని ఎస్ఈ వివరించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కన్నబాబు మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభమే కాదు పూర్తయ్యే వరకు సాగు నీటిని సక్రమంగా అందించేలా ఇరిగేషన్ అధికారులు వెంట పడతానన్నారు. నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఇంపల్స్ ఆసిల్లోమెట్రీ ప్రారంభం



ఇంపల్స్ ఆసిల్లోమెట్రీ పరికరాన్ని ప్రారంభించి పనితీరును పరిశీలిస్తున్న డాక్టర్ నరసింహం తదితరులు

- ఇండియన్ ఆయిల్ సంస్థ ఉదారత

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో ఇంపల్స్ ఆసిల్లో మెట్రీ పరికరాన్ని ఆదివారం రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ సంస్థ ఉదారతతో జీజీహెచ్‌లోని పల్మనాలజీ వార్డులో ఈ పరికరం ఏర్పాటైంది. రూ.15 లక్షలు విలువ చేసే ఈ పరికరం ఊపిరితిత్తుల పనితీరును గుర్తించేందుకు సహకరిస్తుందని డాక్టర్ నరసింహం తెలిపారు. రోగి నాసిక వద్ద ఈ పరికరం గొట్టం పెడితే ఊపిరితిత్తుల స్థితిగతులపై నిర్దిష్ట అంచనాకు రావచ్చని డాక్టర్ నరసింహం అన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ సంస్థ ఉదారతను డాక్టర్ నరసింహం అభినందించి, ప్రతినిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, పల్మనాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సూర్యకుమారి, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నీరు లేక నెర్రెలు!

- సాగునీరందక రైతులు గగ్గోలు
- నిరుపయోగమవుతున్న ఊడ్పులు, దమ్ములు
- అధికారులు స్పందించాలని అన్నదాత వేడుకోలు



విజయరాయుడుపాలెంలో బీటలువారిన ఊడ్చిన పొలం

కరప: మండలం విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు గ్రామాల ఆయకట్టుకు సాగునీరందక సాగుభూమి నెర్రెలు బారుతోంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వెల్ల లాకుల నుంచి నార్త్ కెనాల ద్వారా ఆ గ్రామాలకు సాగునీరు సరఫరా అవుతోంది. ఇటీవలి వర్షాలకు కొద్దిపాటి నీరు రాగా, మురుగు కాలువల్లో ఇంజిన్ల ద్వారా తోడుకుని కొందరు రైతులు దమ్ములుచేసి, వరినాట్లు వేశారు. మరి కొందరు దమ్ములు చేసుకున్నారు. నాలుగు రోజులుగా కాస్తున్న ఎండలకు సాగునీరందక ఊడ్చిన పొలాల్లో నెరలుతీసి, ఎండిపోయాయని, చేసిన దమ్ములు కూడా ఆరిపోయాయని రైతులు తెలిపారు. మండల పరిధిలోని పంట పొలాలు కొవ్వూరు ఇరిగేషన్ సెక్షన్, జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్‌లో ఉంటాయి. జగన్నాధగిరి సెక్షన్ పరిధిలో వచ్చే విజయరాయుడు, పెద్దాపురప్పాడు భూములను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆ శాఖ ఏఈఈ, లష్కర్లకు ఫోన్లు చేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని, కాలువపైకి రావడం లేదని రైతులు అంటున్నారు. ఎకరానికి రూ.15 వేలు పెట్టుబడి పెట్టానని, ఊడ్చినపొలం ఎండిపోయి, నెరలు తీసిందని రైతు తెమ్మనబోయిన అర్జునరావు తెలిపారు. కొవ్వూరు సెక్షన్‌లో గరువుకాలువ భూములుకూడా ఆరిపోతున్నాయని కరప, పేపకాయలపాలెం రైతులు తెలిపారు. ఇప్పటికే ఎకరానికి రూ.12 వేలు నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు తడుపుకోకపోతే ఊడ్చినపొలాలు ఎందుకు పనిచేయవంటున్నారు. అధికారులు స్పందించి సాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని , వంతులువారీ విధానమైన అమలుచేయాలని రైతులు కోరుతున్నారు.

పుస్తక ఆవిష్కరణలు



ఒకసారి ఆలోచిద్దామా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కాకినాడ కల్చరల్: స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో సాహితీ స్రవంతి నగరశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత రెంటాల వేంకటేశ్వరావు రచించిన 'ఒకసారి ఆలోచిద్దామా' పుస్తక పరిచయ సభ ఆదివారం సాయంత్రం డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా రెంటాల రాసిన ఒకసారి ఆలోచిద్దామా పుస్తకాన్ని శ్రీమధునాపంతుల సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. తదుపరి రెంటాల అనువాద పుస్తకం 'అట్లాస్ ష్రగ్డ్' నవలపై జోస్యుల ప్రసంగించారు. రెంటాల ఈ పుస్తకంలో మనస్తత్వాలూ, భావోద్వేగాలపై మంచి విశ్లేషణ చేశారని మరో వక్త అవధానుల మణిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో స్రవంతి నగరశాఖ అధ్యక్షులు మార్ని జానకీరామ్‌చౌదరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గనారా, కాళ్లకూరి శైలజ తదితరుల పాల్గొన్నారు.

నర్తనబాల అవార్డుల ప్రదానం



నర్తనబాల పురస్కారాలు పొందిన శ్రీ బాలత్రిపుర సుందరి నృత్యనికేతన్ విద్యార్థినులు

కాకినాడ కల్చరల్: స్థానిక శ్రీబాల త్రిపుర సుందరి నృత్యనికేతన్ విద్యార్థినులకు నర్తనబాల అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. అభినయ నృత్యభారతి సంస్థ ఆధ్వర్యంలో 8వ జాతీయస్థాయి నర్తనబాల-23 అవార్డుల ప్రదానోత్సవం ఏలూరులోని వైఎంహెచ్ఏ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన నృత్యనికేతన్ విద్యార్థినులు అక్షయ భావన, జహ్నవి విజ్ఞసాయి, లోహిత శ్రీసాయి ప్రణవి, నిహారిక రెడ్డి, శివరంజని, సాత్విక చక్కని హావభావాలతో నృత్య ప్రదర్శనలు చేసి మెప్పించారు. వీరికి అభినయ నృత్య భారతి సంస్థ నర్తనబాల అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. నాట్యాచార్య బేతా సత్యనారాయణను సత్కరించారు. పురస్కారాలు నాట్యరంగంపై మరింత బాధ్యతను పెంచాయని బేతా అన్నారు. పలువురు నగర ప్రముఖులు ఆయనను అభినందించారు.

సంపద కన్నా స్నేహం గొప్పది

- బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం



బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఐక్యత చాటుతున్న స్నేహితులు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, డాక్టరు అడ్డాల సత్యనారాయణ, న్యాయవాది యనమల రామం, రామకృష్ణంరాజు, కవి శిరీష, శ్రీనగేష్ తదితరులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని ఐక్యత చాటుకున్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

కాకినాడ రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం ఇవ్వాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇంద్రపాలెంలోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీసీలు అందరూ ఐక్యంగా ఉండాలని, కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని, జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు సీట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరబాబు, పాలిక వెంకటరమణ, పాలిక రమణ, త్రిమూర్తులు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- జీవనోపాధుల మిషన్ సీఈఓ అనిల్‌శర్మ



వేట్లపాలెంలో వ్యాపార సంస్థలను పరిశీలించిన హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర జీవనోపాధుల మిషన్ సభ్యులు

సామర్లకోట: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర జీవనోపాధుల మిషన్ సీఈఓ అనిల్‌శర్మ, స్టేట్ ప్రాజెక్టు మేనేజరు రాజిత్‌వర్మ అన్నారు. మండల పరిధిలో వేట్లపాలెంలో మహిళలు చేస్తున్న వ్యాపారాలను ఆదివారం వారు పరిశీలించారు. డీఆర్‌డీఏ, స్త్రీ నిధి ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న గ్రేస్ బోటిక్, దోస్తీ టిఫిన్ సెంటర్, పాల డెయిరీ యూనిట్లను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వేట్లపాలెంలో బోటిక్ (ఫ్యాషన్ డిజైన్ సెంటర్)ను 2020లో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం రూ.20 లక్షల టర్నోవర్‌తో లాభసాటిగా నడుస్తోందని, నలుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, డీఆర్‌డీఏ డీపీఎంలు బి.వెంకటేశ్వరరావు, ఎ.కేశవ్, స్త్రీనిధి ఏజీఎం చిట్టిబాబు, వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం బి ప్రశాంతి, సీసీలు పాల్గొన్నారు.

ధర్మబోధనతో దిశా నిర్దేశం

కాకినాడ కల్చరల్: మనకు అవకాశం దొరికినప్పుడల్లా అద్భుతమైన ధర్మబోధ చేయమే పురాణాల ప్రధాన లక్ష్యమని ప్రముఖ ఉపన్యాసకులు గొట్టుముక్కల వేంకట సత్య నరసింహశాస్త్రి అన్నారు. స్థానిక చల్లా జగన్నాథశర్మ కల్యాణమండపంలో ఆస్వాదన సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోతన భాగవతంపై ఆయన ఉపన్యాసం ఇచ్చారు. భాగవతంలోని తృతీయ స్కంద విశేషాలను వివిధ పద్యాలను ఆలపిస్తూ ఆయన ఉపన్యాసం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి కారుప్రోలు గౌరినాయుడు, డాక్టర్ అనురాధ, డాక్టర్ సిరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాతల ఆశయాలు అభినందనీయం

- రూ.కోటితో కల్యాణ మండపం ఆధునీకరణ
- వైఎంవీఏ ఆధ్వర్యంలో ప్రారంభం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రత్నాజీ

బోట్‌క్లబ్: దాతల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని సేవలు చేయడం అభినందనీయమని ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ అన్నారు. పెద్దమార్కెట్‌లో ది యంగ్‌మెన్స్ వైశ్య అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.కోటితో ఆధునీకరించిన పలివెల వెంకట సుబ్బారావు, మహాలక్ష్మి కల్యాణ మండపాన్ని ఆదివారం ప్రారంభించారు. సుమారు 450 గజాల స్థలాన్ని అప్పట్లో పలివెల భాస్కరావు తల్లి పేరు మీద అసోసియేషన్‌కు ఇచ్చారని, కల్యాణమండపం పాడవ్వడంతో రూ.కోటితో ఆధునీకరించడం గొప్ప విషయమన్నారు. 20 ఏసీ గదులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా దీనిని తయారు చేయడం జరిగిందన్నారు. సాధారణ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా తయారు చేశారన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కంతేటి కాశీ మాట్లాడుతూ దాతలు ఎంతో ముందు చూపుతో విలువైన స్థలాన్ని అందించారన్నారు. వారి ఆశయాలను కొనసాగించాలన్నారు. యంగ్‌మెన్స్ వైశ్యా అసోసియేషన్, పలవెల వెంకట సుబ్బారావు, మహాలక్ష్మమ్మ కల్యాణ మండపం అధ్యక్షుడు లింగమల్లు కృష్ణమూర్తి మాట్లాడుతూ దాత ఆశయాలను నెరవేర్చేందుకు ఈ కల్యాణమండపాన్ని ఆధునీకరించామన్నారు. అసోసియేషన్ కార్యదర్శి దంగేటి నరసింహప్రసాద్, కోశాధికారి వెత్సా ఆనంద్, ప్రాజెక్టు చైర్మన్ పాబోలు చిన పున్నయ్య, దేవత శేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన మరిడమ్మ జాతర

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఏటా శ్రావణ మాసం ఆరంభంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి ప్రారంభించారు. వేల సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అధిక దిగుబడి లక్ష్యంగా..


- అధిక వ్యయం లేని, నాణ్యమైన ఉత్పత్తుల సాధనలో పొలంబడి
- నిష్ణాతులుగా మారుతున్న రైతులు



కొరిపల్లిలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కరప: సాగు వ్యయం తగ్గించి, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న డాక్టర్ వైఎస్సార్ పొలంబడి ద్వారా అన్నదాతలకు ఎంతో మేలు చేకూరుతోంది. వ్యవసాయశాఖ అధికారులు ఇస్తున్న సూచనలు, మెళకువలు, యాజమాన్య పద్ధతులు సూచనలు పాటిస్తూ నాణ్యమైన, అధిక దిగుబడిని ఇస్తున్నారు. మండల పరిధిలో రెండు గ్రామాలను ఎంపికచేసి, ప్రతివారం పొలంబడి నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన గ్రామంలో 25 ఎకరాల్లో 30 మంది రైతులను భాగస్వాములను చేసి, వ్యవసాయశాఖాధికారులు, వీఏఏలు, ఏఈఓలు ప్రతి వారం రైతులకు సాగు పద్ధతులు వివరిస్తూ, అవగాహన కల్పిస్తారు. ప్రతివారం రైతులను సమావేశపరచి పంటలో వచ్చే వివిధ మార్పులను ఎప్పటికప్పుడు సమగ్రంగా పరిశీలించి, వాటిపై చర్చించి, అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ పొలంబడిని పూర్తిగా పొలంలోనే 14 వారాలపాటు నిర్వహిస్తారు. మట్టి నమూనా పరీక్షలు, విత్తనశుద్ధి నుంచి నారుమడి పెంపకం, దమ్ములు, వరినాట్లు, ఎరువులు, పురుగు మందుల వాడకం, నీటి యాజమాన్య పద్ధతులు వివరిస్తారు. ఏయే సమయాల్లో పంటతెగుళ్లు వస్తాయో, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను సమగ్రంగా వివరిస్తారు. అలాగే సాగులో రైతులు తమ అనుభవాలను ఈ బడిలో వివరిస్తారు. ప్రధానంగా మొక్కల ఆరోగ్యం, వాతావరణం, భూమిలోని తేమ, కలుపు మొక్కల సాంద్రత, భూమిలోని పోషకపదార్థాల యాజమాన్యం, తెగుళ్లు, కీటకాలు, అవి చేసే హాని, మిత్ర కీటకాల ఉనికి, వాటి సంఖ్యపై సమగ్రంగా చర్చించి, అవసరం మేరకు ఎరువులు వాడకం, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారు. పొలంబడిలో రైతులు ఒక బృందంగా సమావేశమవ్వడం వల్ల వారిలో ఐకమత్యం, స్ఫూర్తి, నాయకత్వం, సమర్థవంతంగా వనరుల వినియోగానికి, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పతాయని వ్యవయాధికారులు అంటున్నారు.


మండలంలో రెండు పొలంబడులు



కరప మండలపరిధిలో రెండుగ్రామాల్లో పొలంబడులు నిర్వహిస్తున్నాం. ప్రతి బుధవారం కొరిపల్లిలో, గురువారం పాతర్లగడ్డలో వీటిని నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు పొలంబడి ద్వారా రైతులకు వ్యవసాయంలో అనుసరించే ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, సాగు మెళకువలు వివరిస్తున్నాం.

– ఏవీ రాజేష్, కరపమండల వ్యవసాయాధికారి.

సాగులో మెళకువలపై అవగాహన



పొలంబడి వల్ల చాలా నేర్చుకుంటున్నాం. సాగు ఖర్చు తగ్గించుకుని, దిగుబడులు పెంచుకునేలా ప్రతివారం వ్యవసాయాధికారులు మెళకువలు వివరిస్తున్నారు. మేము నేర్చుకున్న పద్ధతులు పక్కరైతులకు కూడా చెప్పగలుగుతున్నాం. పొలంబడి రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటోంది.

– నురికుర్తి వెంకట్రాయుడు, కౌలురైతు, కొరిపల్లి

గద్దర్ మృతి తీరని లోటు

కాకినాడ రూరల్: ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని లోటని జనచైతన్య మండలి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు పెయ్యల పావన్‌ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ రాయుడుపాలెంలో గద్దర్‌కు ఆదివారం సాయంత్రం సంతాప సభ నిర్వహించారు. అంబేద్కర్ బుద్ధ విహార్, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎ్ర16), భారతీయ బౌద్ధ మహాసభ (బీఎస్ఐ), బాబాసాహెబ్ సంక్షేమ సంఘం, కాకినాడ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం, యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరం, ఎస్సీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తరపున సంతాప సభ నిర్వహించి గద్దర్‌కు నివాళులు అర్పించారు. ఆయా సంఘాల ప్రతినిధులు రామేశ్వరరావు, బాబ్జీ, పవన్‌కుమార్, రామ్‌ప్రసాద్, కాశి రామారావు నేలపూడి పెద్దిరాజు, అర్జున్, మాధవి, జ్యోతి, అనిలా, బాబ్జీ, రమ్య, బేబి తదితరులు నివాళులర్పించారు.

ఎస్సీ, ఎస్టీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నివాళి

బాలాజీచెరువు: ప్రజాగాయకుడు గద్దర్ మృతి తీరని లోటని ఎస్సీ,ఎస్టీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జేఎస్టీయూశే అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి జానీపాటి నాని, ఎం.అమ్మిరాజు పేర్కొన్నారు. ఆదివారం గద్దర్ మృతికి చింతిస్తూ ఎస్సీ ఎస్టీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గద్దర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని, గద్దర్ విప్లవ పాటలు పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేవని, ప్రజలను చైతన్యం పరిచే విధంగా ఉండేవన్నారు. ఈ సందర్భంగా పలువురు గద్దర్‌కు నివాళులు అర్పించారు.

వామపక్షాల నివాళి

కాకినాడ సిటీ: ప్రజా గాయకుడు గద్దర్ మృతికి వామపక్షాల నాయకులు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్ మాట్లాడుతూ గద్దర్ తన కళలతో ప్రజలను చైతన్య పరచడానికి కృషి చేశారన్నారు. సీపీఐ నాయకులు తాటిపాక మధు, తోకల ప్రసాద్‌లు గద్దర్ కుటుంబానికి తీవ్ర ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. గద్దర్ విప్లవ పాటలు పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేవని, ప్రజలను చైతన్యపరిచే విధంగా ఉండేవన్నారు.

